7న వాసవీ మాత జయంతి

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ గోదావరి హోమ్స్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో 7న వాసవీ మాత జయంతిని నిర్వహించనున్నట్లు సుచిత్ర సర్కిల్ వాసవీ క్లబ్ అధ్యక్షుడు మాశెట్టి శివకుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు అమ్మవారికి పంచామృత అభిషేకం, ఉదయం 10 గంటలకు సామూహిక కుంకుమార్చనలు, అనంతరం వాసవీ మాత జీవిత చరిత్ర పారాయణం, ఒడి బియ్యం సమర్పణ, మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం



కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ ఎం.ఎస్.రెడ్డి నగర్‌లోని కమిటీ హాల్‌లో ఆదివారం రష్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఉదయం 7 నుంచి 10 గంటల వరకు శిబిరం కొనసాగింది. ఈసీజీ, జీఆర్‌బీఎస్, థైరాయిడ్, కంటి, బీపీ, ఎస్పీఓ–2 పరీక్షలతో పాటు ఉచిత కన్సల్టేషన్, మందులు అందజేశారు.

ఉన్నత చదువులకు తోడ్పాటు అందిస్తా



చెక్కు అందజేస్తున్న భరతసింహారెడ్డి

కుత్బుల్లాపూర్: చదువులో ఉత్తమ ప్రతిభ కనబరిచే విద్యార్థుల ఉన్నత చదువులకు ఆర్థికంగా సహాయ పడతానని బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరతసింహారెడ్డి అన్నారు. టెన్త్ పరీక్షా ఫలితాల్లో నియోజకవర్గ టాపర్‌గా నిలిచిన జీడిమెట్ల జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని శరణ్యను ఆదివారం సన్మానించి రూ.10వేల చెక్కును బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జీడిమెట్ల డివిజన్ అధ్యక్షుడు జోగిని రాజు, వీరారెడ్డి, దుర్గయ్య, ప్రతాప్, కృష్ణ, సాయిలు, సతీష్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో ఫర్నిచర్ ధ్వంసం చేసిన బిల్డింగ్ యజమాని

జీడిమెట్ల: బిల్డింగ్ యజమాని తాను అద్దెకు ఇచ్చిన స్కూల్‌లో చొరబడి ఫర్నిచర్, కంప్యూటర్స్ ధ్వంసం చేశాడు. ఈ ఘటన జీడీమెట్ల పీఎస్ పరిధిలో శనివారం రాత్రి జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. కుత్బుల్లాపూర్ విలేజ్‌లో కె.ఛాయాదేవి వెంకటరెడ్డికి చెందిన నాలుగు అంతస్తుల భవనాన్ని 15 సంవత్సరాలు అగ్రిమెంట్ చేసుకుని ఓ ప్రైవేట్ స్కూల్‌ను నడిపిస్తుంది. శనివారం అర్ధరాత్రి బిల్డింగ్ యజమాని వెంకటరెడ్డి, అతని భార్య, కూతురు, మరో 50 మందితో కలిసి స్కూల్ వద్దకు చేరుకున్నారు. అందరూ కలిసి స్కూల్ తాళాలు పగులగొట్టి ఫర్నిచర్‌ను ధ్వంసం చేశార. ఈ విషయమై పాఠశాల ప్రిన్సిపాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సామూహిక ఉపనయనం



కార్యక్రమంలో పాల్గొన్న బ్రాహ్మణ సంఘం సభ్యులు

ఆల్విన్‌కాలనీ: కామాక్షి బ్రాహ్మణ సంఘం నిజాంపేట్ ఆధ్వర్యంలో హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని నిజాంపేట్ సెవెన్ హిల్స్ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం సామూహిక ఉపనయనాలను నిర్వహించారు. ఆయా ప్రాంతాలకు చెందిన 9 మంది వటులకు వేద పండితులు దుర్గా చరణ్ ఉపనయన సంస్కార క్రతువులు నిర్వహించారు. డాక్టర్ మారేపల్లి భువనేశ్వరి అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. సభలో ప్రముఖ కవి, రచయిత పుట్టమురాజు రామచంద్రమూర్తి మాట్లాడుతూ.. సంస్కృతి, ధర్మాన్ని పరిరక్షించడంలో అందరూ ఐక్యంగా ముందుకు రావాలని అన్నారు. అనంతరం గరినెపూడి రాధాకృష్ణ మూర్తి, ప్రముఖ సినీ నటులు సుబ్బరాయ శర్మ, రామా వివేకానంద, డాక్టర్ కావూరి శ్రీనివాస శర్మలు మాట్లాడారు. ఘంటసాల సంగీత సాధనాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన భక్తి గీతాలాపన ఆహుతులను ఎంతగానో అలరించాయి. అనంతరం అన్నదాన వితరణ నిర్వహించారు. కార్యక్రమంలో సుధాకర్, నరసింహారావు, శ్రీనివాస్, కరుణాకర్, మాణిక్యాలరావు, శంకర్, రామారావు, లక్ష్మీనారాయణ, వెంకటరమణి, కల్యాణి, పార్వతి, బాల పరమేశ్వరి, పద్మావతి, జయశ్రీ, అనిత, ఛాయాదేవి, గౌరీ, కులకర్ణి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఒక్క అడుగు ముందుకు.. రెండు అడుగులు వెనక్కు!

స్టీల్ బ్రిడ్జి నిర్మాణంపై నీలినీడలు

- బీఆర్ఎస్ పాలనలో రూ.56 కోట్ల నిధులు
- బ్రిడ్జి నిర్మాణం, రోడ్డు వెడల్పునకు ప్రణాళికలు
- ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌తో ఆగిన పనులు



కల్వర్టుపై ఉన్న 15 ఫీట్ల రోడ్డుపై ఇలా..

కుత్బుల్లాపూర్: ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న స్టీల్ బ్రిడ్జి నిర్మాణం ఒక అడుగు ముందుకు, రెండు అడుగులు వెనక్కి అన్నట్లుగా మారింది. నాలుగేళ్ల క్రితం అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ బ్రిడ్జి నిర్మాణం కోసం రూ.56 కోట్ల నిధులు మంజూరు చేసింది. రోడ్డు వెడల్పుతో పాటు బ్రిడ్జి నిర్మాణం చేపట్టేందుకు ప్రణాళికలు సైతం సిద్ధం చేశారు. నాటి నుంచి నేటి వరకు ఇదిగో బ్రిడ్జి పనులు.. అదిగో ప్రారంభం అంటూ.. చెప్పడమే తప్ప ఆచరణలో లేదు. దీంతో వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రాజెక్టు విభాగం ఆధ్వర్యంలో అంచనాలు రూపొందించి తాజాగా టెండర్లు పెట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఎన్నో ఏళ్ల నుంచి వాహనదారులకు ఇబ్బంది కరంగా మారినా సుభాష్ నగర్ పైపులైన్ రోడ్డులో ఉన్న ఈ బ్రిడ్జి నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.

టెండర్ల ప్రక్రియ పూర్తయ్యేనా?

కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని సుభాష్ నగర్–జీడిమెట్ల డివిజన్లకు అనుసంధానంగా సుభాష్ నగర్ పైపులైన్ రోడ్డు ఉంది. ఎన్నో ఏళ్ల నుంచి ఫాక్స్ సాగర్ నుంచి వచ్చే కెమికల్ నాలా బ్రిడ్జి వద్ద కేవలం 15 ఫీట్ల రోడ్డు ఉండటంతో అటువైపుగా రాకపోకలు సాగించే వాహనాలు బ్రిడ్జి దాటాలంటే నరకం చూస్తున్నారు. ఒకవేళ ఎదురుగా ఏదైనా వాహనం వచ్చింది అనుకో... ఇక అంతే. ట్రాఫిక్ జామ్‌తో ఇబ్బందులు పడాల్సిందే. ఇటీవల అల్వాల్ ట్రాఫిక్ పోలీసులు ఇక్కడ సిగ్నల్ ఏర్పాటు చేసినప్పటికీ పలువురు వాహనదారులు ఇవేమీ పట్టించుకోకుండా వెళ్తుండటంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. ఈ విషయంపై హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రాజెక్టు విభాగం అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి స్టీల్ బ్రిడ్జి నిర్మాణం కోసం సుమారు 56 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేసి.. ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కోడ్ అడ్డం వచ్చింది. దీంతో రెండు నెలలుగా టెండర్ల ప్రక్రియ పూర్తి కాకపోవడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఎన్నికల కోడ్ ముగియడంతో తిరిగి ఈ బ్రిడ్జి నిర్మాణంపై ప్రాజెక్టు అధికారులు దృష్టి పెట్టారు.

60 ఫీట్ల రోడ్డులో సుమారు 113 నిర్మాణాలు

షాపూర్‌నగర్ రంగా భుజంగా థియేటర్ నుంచి జీడిమెట్ల దివాన్ దాబా వరకు 60 ఫీట్ల రోడ్డుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. 113 నిర్మాణాలు అడ్డుగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీటికి నోటీసులు జారీ చేసి వారికి నష్టపరిహారం అందించిన తర్వాత రోడ్డు వెడల్పు పనులు చేపట్టేందుకు సిద్ధమయ్యారు. అయితే స్టీల్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి కాకపోవడం, సుమారు ఒక టిన్నర కోట్లతో డ్రైనేజీ నిర్మాణం ప్రారంభించకపోవడం, రోడ్డు విస్తరణలో జాప్యం.. కర్ణుడి చావుకు ఎన్ని కారణాలు ఉన్నాయో.. అన్ని కారణాలతో ఈ రోడ్డులో ఏ పనులు ముందుకు సాగకపోవడం గమనార్హం.

టెండర్లు పిలుస్తాం

సుభాష్ నగర్ పైపులైన్ రోడ్డులో ఉన్న స్టీల్ బ్రిడ్జి నిర్మాణం విషయంపై ఇప్పటికే అంచనాలు రూపొందించి టెండర్లకు సిద్ధం అవుతున్నాం. సుమారు 15 మీటర్ల వెడల్పుతో చేపట్టే ఈ బ్రిడ్జి నిర్మాణం కోసం రూ. 56 కోట్ల రూపాయలు నిధులు మంజూరయ్యాయి. టెక్నికల్ సాంక్షన్ కోసం తిరిగి ప్రభుత్వానికి నివేదించిన అనంతరం పనులు ప్రారంభిస్తాం. రెండు నెలలుగా ఎన్నికల కోడ్ ఉండటంతో ఆలస్యమైంది. ప్రస్తుతం టెండర్ల ప్రక్రియపై దృష్టి సారించాం.. త్వరలోనే వాహనదారుల కష్టాలు తీరుతాయి.

– వెంకటరమణ, గ్రేటర్ హైదరాబాద్ ప్రాజెక్టు డీఈ

ఫ్లైఓవర్ పనులు.. ట్రాఫిక్ ఆంక్షలు



సూచిక బోర్డు ఏర్పాటు చేసిన ట్రాఫిక్ పోలీసులు

నిజాంపేట్: మియాపూర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బాచుపల్లి జంక్షన్ వద్ద ఫ్లైఓవర్ పనుల వల్ల ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. తాత్కాలికంగా బాచుపల్లి జంక్షన్‌ను మూసివేశారు. బాచుపల్లి జంక్షన్‌కు బదులుగా ప్రత్యామ్నాయ మార్గాలు చూపించారు. మల్లంపేట రోడ్డు నుంచి మియాపూర్ రోడ్డు వైపు వచ్చే వాహనాలు ఎడమవైపునకు అంగారా రెస్టారెంట్ వద్ద యూ టర్న్ తీసుకుని మియాపూర్ రోడ్డు, నిజాంపేట్ రోడ్డు వైపు వెళ్లవచ్చు. అలాగే నిజాంపేట్ రోడ్డు నుంచి గండిమైసమ్మ రోడ్డు వైపు వచ్చే వాహనాలు ఎడమవైపునకు మమత హాస్పిటల్ వద్ద యూ టర్న్ తీసుకుని గండిమైసమ్మ రోడ్డు, మల్లంపేట రోడ్డు వైపు వెళ్లవచ్చని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. వాహనదారులు పోలీసులకు సహకరించాలని కోరారు.

ఉచిత కుట్టు శిక్షణ

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని భూదేవి హిల్స్‌లో మహిళా పరపతి సంఘం ఆధ్వర్యంలో ఉచిత కుట్టు శిక్షణ, బ్యూటీషియన్ తరగతులు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10వ తేదీ లోగా ఆసక్తి గలవారు ముందుగా పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

పైపులైన్ చాంబర్ నిర్మాణం

కథనంతో స్పందించిన అధికారులు



షాపూర్‌నగర్- జగద్గిరిగుట్ట పైపులైన్ రోడ్డులో నిర్మించిన నూతన చాంబర్

రంగారెడ్డినగర్: గోదావరి ప్రధాన పైపులైన్ చాంబర్ శిథిలావస్థకు చేరుకున్నా విషయమై సాక్షిలో ప్రచురితమైన కథనానికి జలమండలి ట్రాన్స్‌మిషన్ అధికారులు స్పందించారు. శామీర్‌పేట్ నుంచి సుభాష్‌నగర్ పైపులైన్ రోడ్డు మీదుగా షాపూర్‌నగర్ హెచ్‌ఎంటీ నుంచి కూకట్‌పల్లి, అల్వాల్, కుత్బుల్లాపూర్ జలమండలి డివిజన్లకు గోదావరి జలాల సరఫరా చేసే 800 ఎంఎం, 1000 ఎంఎం, 1500 ఎంఎం డయా పైపులైన్ హైదర్‌నగర్‌లోని జలమండలి స్టోరేజ్ చాంబర్‌కు వెళ్తోంది. అయితే షాపూర్‌నగర్– జగద్గిరిగుట్ట రోడ్డులో ఉన్న జలమండలి పైపులైన్ చాంబర్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ధ్వంసమైంది. సదరు చాంబర్‌కు మరమ్మతులు నిర్వహించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న విషయమై 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు సమీపంలోనే మరో చాంబర్‌ను ఏర్పాటు చేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

నిజాంపేట్: నిజాంపేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. 2011–12 విద్యా సంవత్సరంలో పదో తరగతి కలిసి చదివిన వారిని ఆ వేదిక ఒక్క చోటికి చేర్చింది. ఒకరికొకరు గుర్తు పట్టుకోలేనంతగా మారిపోయిన తమ చిన్ననాటి స్నేహితులను ఒక్కసారిగా చూడగానే పులకించిపోయారు. ప్రస్తుత గురువులతో పాటు వారి జీవితాల్లో వెలుగులు నింపే దిశగా పునాదులు వేసిన ఆనాటి గురువులను ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. చివరిగా తమకు చదువుకున్న బడిలో చిన్ననాటి స్నేహితులు పంచిన ఆనందాల ఒడిని ఒడిసిపట్టుకుని మళ్లీ ఎప్పుడు కలుస్తామో.. అంటూ భారమైన అడుగులతో ప్రాంగణాన్ని వీడి తమ గమ్యం వైపు సాగిపోయారు. అనంతరం నిజాంపేట్ జెడ్పీహెచ్ఎస్ పూర్వ ఉపాధ్యాయుడు ముక్కర్ల లాలయ్య 62 వసంతాలు పూర్తి చేసుకుని 63వ వసంతంలోకి అడుగిడిన సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కూకట్‌పల్లి: బాలాజీనగర్ డివిజన్‌లో టీవీఆర్ నగర్ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కేపీహెచ్‌బీ డివిజన్ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావుతో కలిసి ప్రారంభించారు. నిరుపేదలు ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బాబురావు, కృష్ణారావు, శ్యామల రాజు, సాయి తదితరులు పాల్గొన్నారు.

సత్తాచాటిన వివేకానంద విద్యామందిర్ విద్యార్థులు



విద్యార్థులతో ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌గౌడ్, కరస్పాండెంట్ సునీత

కుత్బుల్లాపూర్: టెన్త్ ఫలితాల్లో సుభాష్‌నగర్‌కు చెందిన వివేకానంద విద్యామందిర్ హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. స్కూల్ ప్రిన్సిపాల్ మండవ శ్రీనివాస్‌గౌడ్, కరస్పాండెంట్ సునీత, ప్రిన్సిపాల్ లత ప్రతిభ చూపిన విద్యార్థులను ఆదివారం సత్కరించారు. టెన్త్ ఫలితాల్లో వినయశ్రీ 571/600తో స్కూల్ టాపర్‌గా నిలిచింది. చరిత్ర 566/600, హాసిని 557/600, తేజస్వీర్ 553/600, దుర్గ వైష్ణవి 550/600, సుమిత్ర దాస్ 547/600, జాహ్నవి 546/600, జగన్ 542/600, ఆయుష్ కుమార్ 539/600, సుశీల 539/600, నైని 537/600, సూర్య ప్రకాష్ 537/600, రోహిత్ రెడ్డి 535/600, పూజిత 533/600, భూమి కుమారి 532/600, రోషన్ 529/600, సుహాని ఝా 524/600, ఆయుష్ కుమార్ 519/600, పూనమ్ కౌర్ 512/600, లక్ష్మి 509/600, జ్యోతిక శ్రీ 506/ 600, తేజ 504/600, దేవరాజ్ 504/600, కుమారస్వామి 500/600 మార్కులు సాధించారు. మొత్తం 24 మంది 500 పైచీలుకు మార్కులు, అదే విధంగా 40 మంది 450కి పైగా మార్కులు పొందారు. 99 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు శ్రీనివాస్ తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించడంలో ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల పట్టుదల, వారి తల్లిదండ్రుల సహాయ సహకారాలున్నాయని పేర్కొన్నారు.

నేడు కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశం

కుత్బుల్లాపూర్: అల్వాల్ సర్కిల్ ఈ–సేవా కేంద్రం రాజీవ్ గాంధీ విగ్రహం నుంచి అల్వాల్ సర్కిల్ ఇందిరా గాంధీ విగ్రహం వరకు సోమవారం 'సంవిధాన్ బచావో' పాదయాత్ర, అనంతరం వీబీఆర్ గార్డెన్‌లో కాంగ్రెస్ జిల్లా విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం ఉంటుందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి నియోజకవర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఘనంగా గుబ్బల లక్ష్మీనారాయణ జన్మదినం

కుత్బుల్లాపూర్: బీఆర్ఎస్ సుభాష్‌నగర్ డివిజన్ నాయకుడు గుబ్బల లక్ష్మీనారాయణ జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. దండమూడి ఎన్‌క్లేవ్‌లోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే వివేకానంద్ ఆధ్వర్యంలో లక్ష్మీనారాయణతో కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గుబ్బల లక్ష్మీనారాయణను సన్మానించిన ఎమ్మెల్యే వివేకానంద్

పార్కులను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే వివేకానంద్



ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: కాలనీల్లోని పార్కులను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. ఆదివారం గాజులరామారం డివిజన్ మహదేవపురంలో రూ. 90 లక్షల నిధులతో ఏర్పాటు చేసిన పార్కును, ఉషోదయ కాలనీ ఫేజ్–2లో రూ.80 లక్షలతో నిర్మించిన విఘ్నేశ్వర పార్కు, సమగ్ర పార్కులను కార్పొరేటర్ రావుల శేషగిరితో కలిసి వారు ప్రారంభించారు. పార్కులో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ప్రారంభించి ఎంపీ, ఎమ్మెల్యే కొద్ది సేపు వ్యాయామం చేశారు. అనంతరం ఉషోదయ కాలనీ ఫేజ్ 1లో సీసీ రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అభివృద్ధి పనులకు ఎన్ని నిధులైనా వెచ్చిస్తామని అన్నారు. కార్యక్రమంలో ఫాక్స్ డైరెక్టర్ పరిశ శ్రీనివాస్‌యాదవ్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు విజయరామిరెడ్డి, నాయకులు కస్తూరి బాల్‌రాజ్, అడ్వకేట్ కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భగీరథ మహర్షి జయంతి



కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

కుత్బుల్లాపూర్: కొంపల్లి సగర భవనంలో సగర సంఘం అధ్యక్షుడు చంద్ర శేఖర్ ఆధ్వర్యంలో భగీరథ మహర్షి జయంతిని ఆదివారం నిర్వహించారు. భగీరథ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజిరెడ్డి మాట్లాడుతూ.. గంగమ్మను భూమి పైకి తీసుకువచ్చిన మహనీయుడు భగీరథుడని, ఆయన కృషితోనే నేడు గంగమ్మ పరవళ్లు తొక్కుతోందన్నారు. కార్యక్రమంలో బీజేపీ కొంపల్లి అధ్యక్షుడు పెద్దబుద్దుల సతీష్‌సాగర్, అసెంబ్లీ కో కన్వీనర్ శివాజీ రాజు, సగర సంఘం జిల్లా అధ్యక్షుడు మాదంశెట్టి కృష్ణసాగర్, రాష్ట్ర నాయకుడు చీర్ల రామస్వామిసాగర్, ఉదయ్‌వాసు, శ్రీనివాస్‌సాగర్, బీజేపీ నాయకులు జీవన్ రెడ్డి, ఉదయ్ కుమార్, శ్రీకాంత్ రెడ్డి, మధు, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

కొత్త రేషన్ !

- నూతన లబ్ధిదారులకు ఈనెల నుంచి సన్నబియ్యం
- నిరీక్షణకు తెరదించిన ప్రభుత్వం
- దరఖాస్తులపై కొనసాగుతున్న పరిశీలన
- మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో 5,29,698 కార్డులు
- 17,71,767 మంది సభ్యులు



సాక్షి,సిటీబ్యూరో: రేషన్ (ఆహారభద్రత) కార్డులు, వాటిలో కొత్తగా సభ్యుల పేర్ల చేర్పులు/ మార్పుల కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్న వారి నిరీక్షణకు ప్రభుత్వం తెరదించింది. నూతన లబ్ధిదారులకు ఈనెల (మే) నుంచి రేషన్‌బియ్యం పంపిణీ చేస్తోంది. మీ సేవ, ప్రజాపాలనలో భాగంగా దరఖాస్తు చేసుకున్న వారిలో కొందరికి ప్రభుత్వం కొత్తరేషన్‌కార్డులను కూడా మంజూరు చేసింది. సభ్యుల చేర్పుకోసం దరఖాస్తు చేసుకున్న వారి పేర్లు కూడా కార్డుల్లో నమోదవుతున్నాయి. ఇప్పటికే అధికశాతం పేర్లు రేషన్‌కార్డుల్లో చేర్పులు/ మార్పులు జరిగాయి. ఈనెల నుంచి వీళ్లందరికీ సన్నబియ్యం మంజూరు చేసినట్లు పౌరసరఫరాల శాఖ అధికార వర్గాలు చెబుతున్నాయి.

నిరీక్షణకు తెర..

కొత్త రేషన్ కార్డుల కోసం ఐదేళ్లుగా అర్హులైన నిరుపేద కుటుంబాలు ఎదురుచూస్తున్నాయి. రేషన్ కార్డుల్లో పేర్లు తొలగించుకుని నూతనంగా దరఖాస్తులు చేసుకున్న వారు కూడా చాలామంది ఉన్నారు. కొత్తకార్డులు మంజూరు లేక, సభ్యుల నమోదు కాక ప్రభుత్వ పథకాలు, ఆదాయ తదితర ధ్రువీకరణ పత్రాలకు ఇబ్బందులు పడ్డారు. ఎట్టకేలకు ప్రభుత్వం కొత్త కార్డుల మంజూరుతో పాటు నూతన సభ్యులను చేర్చడంతో దరఖాస్తుదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రయోజనం ఇలా..

మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో 818 కొత్తరేషన్ కార్డులు మంజూరయ్యాయి. అలాగే 33 వేలమంది ఉన్న రేషన్‌కార్డుల్లో సభ్యులుగా చేరారు. దీంతో నూతనంగా మొత్తం 17,71,767 సభ్యుల పేర్లు కొత్తగా రేషన్‌కార్డుల్లో నమోదయ్యాయి. ఈనెల నుంచే నూతన లబ్ధిదారులకు రేషన్‌బియ్యాన్ని అందించనున్నారు. వీరందరికీ ఈ నెలలో పంపిణీ చేసేందుకు జిల్లాకు 11 వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మంజూరు చేశారు.

◆ ఆహార భద్రత కార్డులోని ప్రతీ సభ్యుడికి 6 కిలోలు.. అంత్యోదయ కార్డులోని వారికి 35 కిలోలు, అన్నపూర్ణ కార్డు కలిగిన వారికి 10 కిలోల చొప్పున సన్నబియ్యం అందించనున్నారు.

పెండింగ్‌లో 3 వేలు

మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో రేషన్ (ఆహార భద్రత) కార్డుల్లో చేర్పులు/మార్పులకు సంబంధించి 38 వేల దరఖాస్తులు మీసేవ ద్వారా రాగా.. ఇప్పటి వరకు 33 వేల మందిని రేషన్‌కార్డుల్లో సభ్యులుగా పౌరసరఫరాల శాఖ చేర్చింది. ఇవి పోగా, మిగతా 3 వేల మ్యూటేషన్ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు సంబంధిత అధికారవర్గాలు పేర్కొంటున్నాయి.

◆ కొత్త రేషన్‌కార్డుల కోసం మీ సేవతోపాటు ప్రజాపాలనలో పెట్టుకున్న దరఖాస్తులు కూడా వందల్లో పెండింగ్‌లో ఉండగా.. వాటిని రెవెన్యూ అధికారులు పరిశీలించడంతో పాటు విచారణ నిర్వహిస్తున్నట్లు సంబంధిత శాఖ వర్గాలు చెబుతున్నాయి. జిల్లాలో ఇప్పటికే కొత్తగా మంజూరు చేసిన 818 రేషన్‌కార్డులను కలుపుకొని మొత్తంగా 5,29,698 రేషన్ (ఆహారభద్రతా) కార్డులు ఉన్నాయి.

దరఖాస్తుల స్వీకరణ నిరంతర ప్రక్రియ

మీ–సేవ, ప్రజాపాలన దరఖాస్తుదారుల్లో అర్హులను గుర్తించి కొత్త కార్డుల మంజూరు చేయటంతో పాటు చేర్పులు/మార్పుల్లో నూతన లబ్ధిదారులను చేర్చాం. వారికి రేషన్ దుకాణాల్లో ఈ నెల(మే) నుంచి సన్నబియ్యం అందిస్తాం అర్హులు కొత్త కార్డుల కోసం, చేర్పుల కోసం దరఖాస్తు పెట్టుకోవచ్చు. దరఖాస్తుల స్వీకరణ నిరంతరంగా సాగుతోంది.

– శ్రీనివాస్‌రెడ్డి, డీఎస్‌ఓ, మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా